క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు తక్షణమే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం బృందం వైరా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నరసయ్య, హరి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తనాల పంపిణీ

మధిర: మధిర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సొసైటీ)లో మంగళవారం నుంచి జీలుగలు, జనుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి డి.ఎస్.కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగ బస్తా రూ.1,116లు, 40 కేజీల జనుము బస్తా రూ.1,448లు ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం మల్లారం, రొంపిమళ్ల, జాలిముడి, రామచంద్రపురం, యండపల్లి గ్రామాల్లో, బుధవారం మడుపల్లి, రాయపట్నం, గురువారం సిరిపురం, మునగాల, వంగవీడు గ్రామాల్లో, శుక్రవారం మధిర, నక్కలగరువు, దిడుగుపాడు, ఆత్కూరు గ్రామాల్లో విత్తనాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఆయా గ్రామాల్లో ఆధార్, పొలం పాస్ బుక్ జిరాక్స్‌తో ఏఈఓ దగ్గర ఆన్‌లైన్ కూపన్ తీసుకుని మధిర సొసైటీలో విత్తనాలు పొందాలని సూచించారు.

కొణిజర్లలో నెహ్రూ వర్ధంతి



నెహ్రూ, వీరేశలింగం చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ భూక్యా వెంకటేశ్వర్లు, జీవీ సత్యనారాయణ, ఎన్నెస్పీ క్యాంపు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి నివాళి

తల్లాడ: తల్లాడ మాజీ ఎంపీపీ కాంపల్లి రాము విద్యుత్ షాక్‌తో మృతి చెందటంతో సోమవారం ఆయన భౌతిక కాయంపై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పూలమాల వేసి నివాళులర్పించారు. రాము అంతిమ యాత్ర తల్లాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడే కాపా సుధాకర్, నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దుండేటి వీరారెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రాయల రాము, దగ్గుల రఘుపతిరెడ్డి, మార్తెల మల్లిఖార్జున్, జోసఫ్, విశ్వేశ్వరరావు, మోదుగు ఆశీర్వాదం, పైడిపల్లి రవి, సీతయ్య, పాట్టేటి జనార్దన్‌రెడ్డి, గొడుగు నూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు జరబల గోపయ్య సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీపీఐ సీనియర్ నాయకులు పీవీరావు, కొణపర్తి విష్ణు మూర్తి, యాసా వెంకటేశ్వరరావు, తదితరులు గోపయ్య మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారలో స్థానిక నాయకులు పెద్ద మళ్ల రత్తయ్య, రామయ్య తదితరులున్నారు.

గుండెపోటుతో బీజేపీ సీనియర్ నేత..

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం రానికి చెందిన బీజేపీ సీనియర్ నేత పూనాటి వెంకటేశ్వరరావు (76) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. గత నాలుగు రోజుల నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖమ్మంలోని ప్రసూన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందారు. నాగేశ్వరరావు 1980 నుంచి బీజేపీ బలోపేతం కోసం పనిచేస్తూ.. బీజేపీ వైరా మండల అధ్యక్షుడిగా, మధిర ఇన్‌చార్జ్‌గా, జిల్లా కిసాన్ మోర్చా అధ్యకుడిగా అలాగే బీజేపీ రాష్ట్ర నేతగా పని చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం కేజీ సిరిపురంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



వైరాలో ఓటు వేసిన రిటైర్డ్ ఉపాధ్యాయులు



మధిర: పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న మధిర సీఐ మధు



కొణిజర్లలో అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం ఆర్డీఓ గణేష్



ముదిగొండ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, తహసీల్దార్



తల్లాడ: ఓటేసేందుకు వెళ్తున్న దివ్యాంగుడు



వేంసూరులో బారులు దీరిన ఓటర్లు



తల్లాడ: పోలింగ్ కేంద్రం వద్ద..



బోనకల్ పోలింగ్ కేంద్రం వద్ద..



కొణిజర్లలో.. మహిళా పట్టభద్రులు



ఎర్రుపాలెం: పోలింగ్ కేంద్రంలో బారులు దీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం..

- ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- బారులు దీరిన పట్టభద్రులు
- పరిశీలించిన అధికారులు, నాయకులు

వైరా నియోజకవర్గంలో..

వైరాలో 68.97 శాతం పోలింగ్

వైరా: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వైరాలో ప్రశాంతంగా సాగింది. మొత్తం నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 11 గంటల వరకు పోలింగ్ నామ మాత్రంగా సాగింది. మధ్యాహ్నం పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు దీరారు. మొత్తం మండలంలో 2,830 ఓట్లు ఉండగా 1,952 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. 68.97 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ వైరాలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

కారేపల్లిలో 63.70 శాతం..

కారేపల్లి: కారేపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో మండలవ్యాప్తంగా 2,794 మంది పట్టభద్రులకు గాను 1,780 మంది ఓటు వేశారు. దీంతో 63.70 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిశీలించి ఓటింగ్ సరళిని స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల తదితరులు ఉన్నారు.

కొణిజర్లలో 66.40 శాతం..

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో మొత్తం 2,438 మంది ఓటర్లు ఉంగా.. 1,619 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 66.40 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. యువతులు కంటే యువకులే పోలింగ్‌లో ఎక్కువగా పాల్గొన్నారు. కొణిజర్ల పోలింగ్ కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం ఆర్డీఓ గణేష్ పోలింగ్ తీరును సందర్శించారు. పోలింగ్ సమయం మించి పోయిన తర్వాత ఓ యువకుడు ఓటు వేయడానికి రావడంతో అధికారులు అనుమతించలేదు. ఈ క్రమంలో కాసేపు కాంగ్రెస్ నాయకులకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. పోలింగ్ సరళిని తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీడీఓ రోజారాణి, ఎస్ఐ శంకరరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

68.25 శాతం ఓట్లు నమోదు..

ఏన్కూరు: మండల కేంద్రలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 1,597 పట్టభద్రులకు గానూ.. 1,090 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 68.25 శాతంగా ఓటింగ్ నమోదు అయింది. ఓటింగ్ సరళిని తహసీల్దార్ సీహెచ్ శేషగిరి పర్యవేక్షించారు.

మధిర నియోజకవర్గంలో..

మధిరలో 69.83శాతం పోలింగ్..

మధిర: మండలంలో 3,388 మంది ఓటర్లకు గానూ.. 2366 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 2,130 మందికి 1533 మంది ఓటేయగా.. స్త్రీలు 1,257 మందికి 833 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధిర మండలంలో 69.83శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

ఎర్రుపాలెంలో 66.08 శాతం..

ఎర్రుపాలెం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,905 మంది ఓటర్లకు గానూ.. 1,259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 66.08 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. పోలింగ్ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. బూత్‌నెంబర్ 396లో 1,035 మందికి గాను 662 మంది ఓట్లు వేశారు. 397 నంబర్ బూత్‌లో 870 ఓట్లుండగా 597 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహసీల్దార్ ఉషాశారద పర్యవేక్షణ చేయగా, ఎస్సై పి.సురేష్ బందోబస్తు నిర్వహించారు.

ముదిగొండలో 69.11శాతం..

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 364, 365 పోలింగ్ బూతులలో 2,205మంది పట్టభద్రులుండగా.. 1,524 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఆ రెండు పోలింగ్ కేంద్రాల్లో 69.11శాతం ఓట్లు నమోదు అయినట్లు తహసీల్దార్ టి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం ఆర్డీఓ గణేష్, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామిలు పరిశీలించారు.

బోనకల్‌లో 69.5శాతం..

బోనకల్: మండలంలోని 22గ్రామాల్లో 1,971మంది పట్టభద్రులు ఉండగా 1,371మంది తమ ఓటు హక్కును వినియోగంచుకున్నారు. 69.5శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ప్రత్యేక అధికారులుగా పున్నం చందర్, ఎల్ రాజులు విధులను నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ బాక్స్‌లను ఖమ్మం తరలించారు.

చింతకానిలో 73.72 శాతం..

చింతకాని: చింతకాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 73.72 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 1,994 మంది పట్టభద్రుల్లో 1,470 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎంపీడీఓ రామయ్య తెలిపారు. 1,261 మంది పురుషులకు గాను 966 మంది, 733 మంది మహిళలకు 504 మంది ఓటు వేశారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో 10 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించినట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్సై నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

సత్తుపల్లిలో 70.51శాతం..

సత్తుపల్లిటౌన్: మండలంలో 4605 ఓట్లకు గాను 3247 ఓట్లు పోల్‌కాగా 70.51 శాతం పోలింగ్ నమోదైంది. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను కల్లూరు ఏసీపీ ఎ.రఘు, కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్‌గౌడ్, తహశీల్దార్ యోగేశ్వరరావు పరిశీలించారు.

కల్లూరు మండలంలో 66.97 శాతం..

కల్లూరు: మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 3,720 మంది ఓటర్లు ఉండగా.. 2,491 మంది ఓట్లు వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 66.97 శాతం పోలింగ్ నమోదైంది. సీఐ వెంకటేష్ గౌడ్, ఎస్ఐ షాకీర్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆర్డీఓ ఎల్ రాజేందర్ ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌పార్టీ నాయకులను కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేంసూరులో 66.71 శాతం పోలింగ్..

వేంసూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 2,286 ఓటర్లకు గాను 1,525 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ ఎంఏ రాజు తెలిపారు. 66.71 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్ రాజు, ఎస్ఐ, ఎంపీడీఓలు పరిశీలించారు.

తల్లాడ మండలంలో 68.76 శాతం

తల్లాడ: తల్లాడ పోలింగ్ స్టేషన్‌లో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో మొత్తం ఓట్లు 2,686 కాగా.. 1,847 ఓట్లు పోలయ్యాయి. 68.76 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మండలంలోని 27 గ్రామ పంచాయతీల నుంచి ఇక్కడకు ఓటేసేందుకు పట్టభద్రులు వచ్చారు. కుర్నవల్లి సొసైటీ అధ్యక్షుడె అయిలూరి ప్రదీప్‌రెడ్డి తన సతీమణితో పాటు వచ్చి తల్లాడలో ఓటేశారు. ఎన్నికలను సెక్టార్ అధికారి రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎస్సై కొండల్‌రావు పర్యవేక్షించారు.

పెనుబల్లిలో 64.34 శాతం..

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు బూతులలో 2,451 మంది పట్టభద్రులకు గానూ 1,577 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 64.34 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది.



పెనుబల్లిలో..



కారేపల్లి: పోలింగ్ కేంద్రంలో..



కల్లూరు పోలింగ్ కేంద్రంలో..



సత్తుపల్లిటౌన్: బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ ఎల్.రాజేంద్రగౌడ్



కొణిజర్ల: ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరాలో ఓటు వేయడానికి లైన్‌లో నిలుచున్న యువతులు



ఏన్కూరులో.. ఓటు వేసేందుకు బారులు దీరిన పట్టభద్రులు



వైరాలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు



ముదిగొండ: చిన్నారులతో ఓటు వేసేందుకు వచ్చిన దంపతులు



సత్తుపల్లిటౌన్: తొలిసారి ఓటేసిన అక్కా చెల్లెళ్లు



కొణిజర్లలో ఓటు వేసేందుకు బారులు దీరిన పట్టభద్రులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నాయకులు

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి..



కల్లూరులో ఎమ్మెల్సీ ఓట్ల సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్: కల్లూరులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓట్ల పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏ విధంగా నమోదు అవుతుంది అనే విషయాలను సోమవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి పరిశీలించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నకు ఏ విధంగా ఓటు నమోదు అవుతున్నాయి. పోలింగ్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ చౌదరి, ఎస్‌కె యాకూబ్ అలీ, పెద్ద బోయిన శ్రీనివాసరావు, ఎస్‌కె ఉస్మాన్, ఎస్‌కె తురాబ్ అలీ, పాపబత్తిని నగేష్, పసుమర్తి మోహన్ రావు, తోటకూర శేషగిరిరావు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయం: సండ్ర వెంకటవీరయ్య

కల్లూరురూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని సమీక్షించేందుకు ఆయన సోమవారం కల్లూరులో ఏర్పాటు చేసిన ఎన్నికల శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యల గురించి గట్టిగా నిలదీసే గొంతు రాకేష్‌రెడ్డిదేనని అందువల్ల గ్రాడ్యుయేట్‌లందరూ రాకేష్‌రెడ్డినే గెలిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్, కల్లూరు ఎంపీపీ బీరవెల్లి రఘు, బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, రామకృష్ణ, కిరణ్, అంజి పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం



పెద్దమునగాలలో బీరప్ప, కామరాతి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న కురుమ పెద్దలు



బీరప్ప కల్యాణానికి హాజరైన భక్తులు

కొణిజర్ల: మండలం పెద్దమునగాలలో బీరప్ప కొలుపు ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్పస్వామి కామరాతి అమ్మవార్ల కల్యాణ క్రతువు కురుమ పెద్దలు అత్యంత వైభవంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెద్దమునగాలతో పాటు చుట్టు పక్కల పలు గ్రామాలకు చెందిన కురుమలు, యాదవులు భారీగా తరలివచ్చారు. వేలాది మంది భక్తులకు స్వామి కల్యాణాన్ని తిలకించి ఆనంద పరవశులు అయ్యారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కథ ఆకట్టుకుంది. కుల పెద్దలు దాడె శ్రీను, చింతల లాలయ్య ఇతర పెద్దల సమక్షంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. ఇతర గ్రామాల నుంచి కురుమల బంధువులు, స్నేహితులు తరలి రావడంతో గ్రామంలో రహదారులన్నీ కిటకిల లాడడంతో సందడి వాతావరణం నెలకొంది.

సేవకుడికి ఆర్థిక సాయం..

సత్తుపల్లి: ఆర్‌కే ఫౌండేషన్‌తో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇనపనూరి రాధాకృష్ణ(ఆర్‌కె) అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వాహిని పవర్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ గాయం అంజిప్రసాద్ సోమవారం తమవంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న సేవకుడికి సాయం అందించి భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేలా దేవుడు ఆరోగ్యాన్ని ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దూదిపాల రాంబాబు, గాదె చెన్నారావు, టోపి శ్రీను, మొండెద్దు కృష్ణారెడ్డి, ఎం.ప్రసాద్, నాగభూషణం, సందీప్‌గౌడ్, రాజబాబు, రాయల కోటేశ్వరరావు, జమలయ్య పాల్గొన్నారు.



రూ.5వేలు నగదు అందజేస్తున్న అంజిప్రసాద్, తదితరులు

నిబంధనల ప్రకారమే అనుమతులు

కారేపల్లి: నూతనంగా ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత నిబంధనలు తూచా.. తప్పకుండా పాటిస్తేనే విద్యాశాఖ నుంచి అనుమతులు వస్తాయని ఎంఈఓ జయరాజు అన్నారు. సోమవారం కారేపల్లిలోని బస్టాండ్ సెంటర్ జడల కాంప్లెక్స్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కె.వి. ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోని తరగతి గదులు, టాయ్‌లెట్ స్కూల్ గోడలకు చిత్రలేఖనములు, క్రీడా ప్రాంగణం, ఫైర్ అనుమతులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్కూల్ ఏర్పాటుకు స్కూల్ నిర్వాహణ కమిటీ సభ్యులతో సొసైటీని ఏర్పాటు చేయాలని, నిబంధనలకు అనుగుణంగా విద్యాబోధన చేసే ఉపాధ్యాయుల అర్హతలు ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు జడల వెంకటేశ్వర్లు, దంజీలాల్, నరేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

పెనుబల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన రూ.12 వేల హామీని వెంటనే అమలు చేయాలని వ్య.కా.స జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన వ్య.కా.సా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ల చిరంజీవి, సీతారాములు, కె.రామకృష్ణ, టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.